# డబ్బు · డబ్బు · డబ్బు

రచన:

**"వల్లభ్"**

బరువు భారంతో క్రుంగిపోతూ రైలు బండి 'భుఁయ్'మని ఒక నిట్టూర్పు విడిచి బయలుదేరింది. పెట్టుబడిదారీ సమాజంలో కష్టనష్టాలకు గురయి హీన స్థితిలో వున్న మానవుడు పురోగమనం సాగించినట్టే బండి ప్రయాణం సాగిస్తోంది. అలసి సొలసి వున్నప్పటికీ ముందుకు సాగుతోందంటే తన శక్తి మీద దానికెంత విశ్వాసం వుందంటారు? ప్రగాఢ విశ్వాసం! గమ్యస్థానానికి చేరుకోగలనని, అందాక తనకు వాస్తవంగా శాంతి విశ్రాంతి లేదని తెలుసు. అందుకే క్రుంగిపోతూ కూడ ప్రయాణం సాగిస్తోంది; మంద గమనంతో.

బండి బయలుదేరిన తరువాత రాము మనస్సు కుదుట పడిందని మనము అనుకోవడమే గాని అందులో సత్యం ఏమీ లేదు. రాము మనస్సు పరుగిడుతోంది. వడిగా, వడివడిగా పరుగిడుతోంది. అత్తవారింటి దగ్గరనుండి తన భార్యకు జబ్బుగా వుందని, అతి త్వరగా రావాలసిందని మొన్న టెలిగ్రామ్ వస్తే తాను నేడు వెళ్తున్నాడు. కారణం, అతని దగ్గర డబ్బు లేదు. ఎంతో గాదు. చార్జీలకు కావాల్సిన ఐదు రూపాయలు కూడ లేవు. నిన్నల్లా—ఉదయం ఏడుగంటలకు లేచిన రాము సాయంత్రం 6 గంటల వరకు డబ్బుకోసం అన్వేషణ చేస్తూనే వున్నాడు. కనపడిన ప్రతివాడిని అడిగాడు. కాని ఫలితం దక్కలేదు. చివరకు పాపం సుబ్బారావు మాట దక్కించాడు.

అసలు సుబ్బారావు దగ్గర డబ్బు వుండదని లేదని కూడ రాముకు తెలుసు. తెలిసీ కూడ అడిగాడు. సుబ్బారావు అతని దుస్థితిని చూచి ఎంతో బాధపడ్డాడు. పోనీ బాధపడి సానుభూతిగా ఒక నిట్టూర్పు విడిచి అందరిలా వూరుకున్నాడా? లేదు. ఏదోవిధంగా అటుతిరిగి యిటుతిరిగి అడగని వాళ్లందరిని అడిగి చివరకు ఐదురూపాయలు తెచ్చి యిచ్చాడు. తనకు నేడు సుబ్బారావులాంటి మిత్రుడు లేకపోతే ఏమయ్యేవాడు? యిప్పటికైనా బయలుదేరగలిగాడు...అదే పదివేలు!—అనుకుంటూ తనలో తానే సుబ్బారావుకు ధన్యవాదాలర్పించాడు.

రాము స్థితి చూచి ఎంత మంది సానుభూతిని ప్రకటించలేదు.—'అరె! నా దగ్గర చిల్లుగవ్వైనా లేకుండా పోయిందేమోయి, నీవు అడిగేటప్పటికి' అని ఒకడు–'అసలు నా దగ్గర డబ్బులుంటే నీవు అడగాలటోయి.' అని ఒకడు — 'పాపం! భార్యకు జబ్బుచేస్తే వెళ్లలేక పోతున్నావేమోయి' అని మరొకడు ఈ విధంగా తను అడిగిన ప్రతివాడు అంతో యింతో తనకు తోచినంత ఆర్థిక సహాయం చేయలేకపోయినా హార్దిక సహాయం మాత్రం చేశారు.

వాళ్లంతా రాముకి కావాల్సిన మిత్రులు. అతని చేతిలోని ఆర్టును చూచి ఎప్పుడూ పొగుడుతూనే వుంటారు. వారందరికి అతనంటే ఎంతో అభిమానం. ఎంతో గౌరవం. నేడు తనకు అవుసరమైన డబ్బు యివ్వలేదని వాళ్లను కాదని ఎట్లా అనగలడు? అసలు వాళ్లదగ్గర వుంటేగా, తనకు యివ్వటానికి? ప్రతివాడికి ఏపూట కాపూట ఒక గొప్ప పండుగలాగానే వుంది. ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ. తమను సర్దుకోవడమే కష్టమైపోతుంటే యితరులకు సహాయం చేయటం ఎలా సాధ్యమవుతుంది?

సంపాదన దృష్టితో చూస్తే రాము వాళ్లందరికంటే ఒక మెట్టుపైన వున్నాడని చెప్పాలి. అతడు మంచి ఆర్టిస్టు. అతను గీసిన బొమ్మలకు పత్రికల వాళ్లు తన్నుకుంటూ వుంటారు. వాటికి ఎంత రావటానికి అవకాశం వుంటే అంత రాబట్టగలిగేవాడు.

కాని యీ మధ్య నాలుగు మాసాలనుండి ఒక చిల్లుగవ్వైనా సంపాదన లేకపోయింది. అతని జీవితం ఒడుదుడుకుల్లో పడింది. పూట జరగటం మహాఘనమై పోతే! అందువల్లనే తన ఖర్చు తగ్గించుకోటానికి ఎంతో ప్రయత్నించాడు. కొంతవరకు సఫలుడయ్యాడు కూడాను. కాని బాధ బాధగానే వుండిపోయింది.

ఇంతలో అతని భార్య సరస్వతి ప్రసవించే రోజులు దగ్గరకు రావటంవల్ల కన్నవారింటికి వెళ్లింది. ఇది కొంత వరకు బాగానే వుందనుకున్నాడు. బరువు ఎంత తగ్గినా తగ్గటమే. ఎంత కాలానికి తగ్గినా తగ్గటమే! సృష్టి ప్రతికూలంలో కూడ అనుకూలం వుందనుకున్నాడు. అమెరికన్లు కొరియా యుద్ధంలో సాగించిన తిరోగమనంలో కూడ పురోగతి చూపించారని వచ్చిన వార్త అతనికి సబబుగానే తోచింది. అందులో కూడ పురోగతి వుందని అతను అనుకున్నాడు.

కాని భార్యకు జబ్బుగా వుంది త్వరగా బయల్దేరి రావాల్సిందని టెలిగ్రామ్ వచ్చినప్పుడు అతని గుండె ఒక్క క్షణం పాటు ఆగిపోయినట్టయింది. ఆ రాత్రంతా ఏమిటేమిటో కలలుకన్నాడు. ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు వెళదామా అని ఆతురత తప్ప అతనికి డబ్బు సంగతి గుర్తుకు రాలేదు.

(46–వ పేజీ చూడండి)



## విజ్ఞాన వీథులు

(20-వ పేజీ తరువాయి)

పంపి ఆ వెలుగులో అన్ని పొగలూ నీలముగానే కనపడతాయని నిరూపించాడు కూడాను.

ఇంత మట్టుకు ఇది సరిగ్గానే వుంది. కాని "కుంభవృష్టిగా వాన కురిసి గాలిలోని ధూళి కణాలన్నీ కడుక్కుని పోయిన త్వర్వాతకూడా ఆకాశం నీలంగానే – మరింత దట్టమైన రంగుతో–కనపడుతుందే? మరి అలాంటప్పుడు ధూళి కణాలు పక్షపాతంతో విరజిమ్మిన నీలపు కిరణాలే ఆకాశాన్ని నీలంగా కనపరుస్తున్నాయని ఎలాగ అనగలము?" అని పూర్వపక్షము చేశాడు ర్యాలే. ధూళి దిగిపోయిన తర్వాత మిగిలేది గాలి కనక, ఈ గాలి కణాలే తమమీదపడిన వెల్తురులోని నీలపు కిరణాల్ని ఎక్కువగా విరజిమ్మి ఆకాశపు నీలపు రంగుకి కారణ మౌతున్నాయని సిద్ధాంతము చేశాడు ర్యాలే.

సముద్రం నీలంగా కనబడడానికి కారణం ఇక సులువుగా చెప్పకో వచ్చును. సముద్రంలో చొరబడే సూర్యరశ్మిలోని నీలపు కిరణాల్ని నీటికణాలు అన్ని వేపులకీ విరజిమ్ముతున్నాయి. ఏతావాతా సముద్రము నుంచి మనకంటికి చేరేవి ఈ నీలి కిరణాలే కనక సముద్రము మొత్తం మ్మీద నీలముగా కనబడుతుంది.

పొగమంచు యొక్క నీలపు రంగుకూడా ఇలాగు ఏర్పడినదే. చిన్న చిన్న మంచునీటి కణాలు గాలిలో దట్టంగా వున్నప్పుడే పొగమంచు ఏర్పడుతుంది. ఈకణాలన్నీ నీలపు కిరణాల్నే ఎక్కువ విరజిమ్మడము వల్ల పొగమంచూ మొత్తమ్మీద నీలంగా కనబడుతుంది. పొగమంచు దట్టంగా ఆవరించినప్పుడు, ఆ మంచుకి వెనకవైపున వున్న ఇళ్లూ, చెట్లూ కనబడవన్న సంగతి అందరికీ తెలుసును. వాటి నుంచి మనవైపు వచ్చే కిరణాల్ని దట్టంగావున్న పొగమంచు కణాలు విరజిమ్మేస్తాయి. కనక వాటిరూపు కనేబడదు.

## డబ్బు డబ్బు డబ్బు

(15-వ పేజీ తరువాయి)

ఉదయం ప్రయాణానికి సిద్ధమయి బయలుదేరితే జేబులో కానీ లేదు. అతనికి నడుం యిరిగినట్టయింది. అప్పటినుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కనపడిన ప్రతిమిత్రుణ్ని అడిగాడు. చివరకు విసుగు చెంది విసుగుచెంది ఎంతో బాధపడుతూ అడగవద్దనుకున్న సుబ్బారావును అడిగాడు. సుబ్బారావు తన దగ్గర లేక పోయినా ఎక్కడో అప్పు తెచ్చి సర్దితే నేడు ప్రయాణమయ్యాడు.

బండి గగ్గోలు పెడుతూ పోతూనే వుంది. రాము మనస్సు వడిగా వడివడిగా పరుగిడుతూనే వుంది. అక్కడ ఏం జరిగిందో? మామగారు యిప్పుడు దాకా ఎందుకు వున్నావంటే ఏమి చెప్పాలి? అసలు చేసుకున్న భార్య అడిగితే ఏంవంక చెప్పాలి? డబ్బు లేదంటాడా? ఊఁహుఁ అనలేదు. ఈ విధంగా తర్కించుకుంటూనే వున్నాడు. బండి బందరు చేరుకుంది. రాము త్వరగా త్వరత్వరగా దిగి అత్తవారింటికి బయలుదేరాడు, సిగరెట్టు కాల్చుకుంటూ.

భయపడుతూ భయపడుతూ యింట్లోకి అడుగుపెట్టాడు. రాము మరదలు ఎదురై— "అక్కా! బావ వచ్చాడే! నీవుగెలిచావు! నేను ఓడాను." అంటూ వెనక్కు తిరిగి గదిలోకి పరుగెత్తింది. రాము గెలవటం మాట వినేటప్పటికి నిశ్చేష్టుడై ఆ ప్రక్కన పడివున్న కుర్చీలో చతికిలబడ్డాడు.

సరస్వతి—'పుట్టబోయే కొడుకుకంటే నా మీద ఎక్కువ ప్రేమ వుంటుందని నేను చెప్పలేదటే!' అంటూ నవ్వుతూ రాము దగ్గరకు వచ్చింది. రాముకు యిదంతా అగమ్యగోచరంగా వుంది. అదేమిటి? మొన్న మూడు రోజుల నాడు కొడుకు పుట్టాడని కబురుచేశారు. యింకా సరస్వతి ప్రసవించనే లేదా?

సరస్వతి—'ఏమండి! అబ్బాయి పుట్టాడని కబుర్లు చేస్తే రాలేదేమండీ?' అనడిగింది. రాము—'నెమ్మదిగా వచ్చే వాడిని. ఇంతకీ అబ్బాయి యేడీ' అంటూ కొంటెగా చూచాడు సరస్వతి వంక.


సరస్వతి—'నిద్రపోతున్నాడు లేండి!' అన్నది నవ్వుతూ.

కమల నవ్వుతూ—'బావా మీ అబ్బాయి మా అక్కాయి బాగున్నారా?' అనడిగింది.

రాము నవ్వి వూరుకున్నాడు. అతనికి జరిగిందేమిటో అసలు అర్థం కాలేదు; అప్పటికి యిప్పటికి. అతను దానిని గురించి తరువాత కూడ ఎవర్ని అడగలేదు. ★

చిన్నపిల్లల లివర్ ప్లీహ వ్యాధులకు

జమ్మివారి లివర్‌క్యూర్



ఇప్పుడు మాత్రల రూపంలో దొరుకుతున్నది.

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్

మైలాపూరు, మద్రాసు-4

బ్రాంచి: ఓరుగంటివారి వీధి, విజయనగరం సిటీ

BISTA'S—J-281

మా సంమాసం చదవండి

"సందేహాలు సమాధానాలు"

సంపాదకులు:

డాక్టర్ వాస్తవికానందస్వామి

వెల రెండు అణాలు

పైకం పంపిన వారికే కాపీలు

ది ఎగేట్ హెల్తు ఇన్‌స్టిట్యూట్,

మద్రాసు 1